


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




బుధవారం 03 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 001 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అమరవీరులకు ముఖ్యమంత్రి ఘన నివాళి



సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పిస్తూ, తెలంగాణ రాష్ట్రం ఎందరో మహానుభావుల త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి ఫలితంగానే ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తూ ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐక్యంగా సౌభ్రాతృత్వంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



## తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీ పడి దేశానికి ఆదర్శంగా నిలవాలి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

సందేశం టైమ్స్, అమరావతి, జూన్ 3, ప్రతినిధి: తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఏర్పడి నేటికి 12 సంవత్సరాలు పూర్తయ్యాయని, ప్రాంతాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగు జాతి ఎప్పటికీ ఒక్కటేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పరస్పరం పోటీ పడుతూ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. చారిత్రక, సాంస్కృతిక వైభవం కలిగిన తెలుగు నేల భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రపంచ స్థాయి నగరాలుగా ఎదగాలని, ప్రతి తెలుగు కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరి అత్యుత్తమ జీవన ప్రమాణాలు అందాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి పనిచేసి దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వైభవం, ప్రాభవాన్ని చాటాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.



## తెలంగాణను ప్రపంచానికే గేట్‌వేగా తీర్చిదిద్దుతాం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన అధికారిక వేడుకల్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొని రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. స్వరాష్ట్ర అస్తిత్వం కోసం దశాబ్దాల పాటు సాగిన ఉద్యమ పోరాటాలు, అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణను ప్రపంచానికే గేట్‌వేగా నిలబెట్టే దిశగా ప్రతి ఒక్కరూ పునరంకిత భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భద్రతా దళాల కవాతు, పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి, డిసెంబర్ 7, 2023న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి తెలంగాణ అభివృద్ధి, పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజాకవి కాళోజీ మాటలను ఉటంకిస్తూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పరమావధి అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు సహకరించిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువత ఉపాధి, సామాజిక న్యాయం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక పత్రం ద్వారా రాష్ట్రాన్ని 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడమే కాకుండా రెండున్నరేళ్లలో రూ.1.56 లక్షల కోట్లకు పైగా రైతు సంక్షేమానికి ఖర్చు చేసినట్లు తెలిపారు. మహిళల కోసం మహాలక్ష్మి పథకం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనలో భాగంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 67,763 ఉద్యోగాలను భర్తీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామని తెలిపారు. విద్యా రంగ బలోపేతానికి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు, బ్రేక్‌ఫాస్ట్ పథకం, మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాలలకు విస్తరిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లక్షలాది పేదలకు గృహాలు మంజూరు చేసి, రేషన్ కార్డుల ద్వారా కోట్లాది మందికి ఆహార భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. గిగ్ వర్కర్ల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ పోరాట యోధులకు న్యాయం చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా గద్దర్ పేరిట సినిమా అవార్డులను పునరుద్ధరించామని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వే నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలిచామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రత్యేక బీమా పథకాలు, నగదు రహిత ఆరోగ్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సేవల కేంద్రంగా తీర్చిదిద్దుతూ మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ, బుల్లెట్ రైలు కనెక్టివిటీ వంటి భారీ ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని వివరించారు. తెలంగాణను స్వచ్ఛమైన, పర్యావరణహిత, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రజల సహకారం అవసరమని పేర్కొంటూ జై హింద్, జై తెలంగాణ నినాదాలతో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ముగించారు.



## ప్రాంతీయ విద్వేషాలు ఉగ్రవాదం కంటే ప్రమాదకరం : పవన్ కళ్యాణ్

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణలోని భీంరావు వాడ సమస్య కోసం పోరాడిన సమయంలోనే తనపై తొలి పోలీసు కేసు నమోదైందని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. జనసేన పార్టీ ప్రారంభం నుంచే ప్రజా సమస్యలపై పోరాడే పార్టీ అని, ఎలాంటి ఒత్తిళ్లకు భయపడదని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు విస్తరించి పోటీ చేయగలిగితే జనసేన తెలంగాణకు రావడంలో తప్పేంటని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారి ఆంధ్రప్రదేశ్‌లో పోటీ చేస్తామని చెప్పినప్పుడు తాము స్వాగతించామని, అదే విధంగా జనసేన తెలంగాణలో పనిచేయడాన్ని వ్యతిరేకించడం సరికాదన్నారు. తెలంగాణ యువత పోరాట స్ఫూర్తి దేశానికి దిశానిర్దేశం చేస్తుందని, యురేనియం తవ్వకాల వ్యతిరేక ఉద్యమం అందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. జనసేన పార్టీ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తుందనే భయంతో సభలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. దేశంలోని ఏ రాష్ట్రానికైనా వెళ్లే హక్కు ప్రతి భారతీయుడికీ ఉందని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం దేశ సమగ్రతకు ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రజల మధ్య వైరుధ్యాలు పెంచకుండా నిరుద్యోగం, అభివృద్ధి, యువత సమస్యలపై రాజకీయ నాయకులు దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల గురించి మాట్లాడే వారిని శత్రువులుగా చూడటం బాధాకరమన్నారు. ప్రాంతీయ విద్వేషాలు ఉగ్రవాదం కంటే ప్రమాదకరమని, దేశ సమగ్రతను దెబ్బతీసే శక్తులపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయత పేరిట విద్వేషాలు రెచ్చగొట్టే శక్తులను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలను కలిపిన నాయకుడు బూర్గుల రామకృష్ణారావు పేరును రెండు రాష్ట్రాలను కలిపే రహదారికి పెట్టాలని తన ఆకాంక్ష అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో గద్దర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేన పార్టీ ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత విస్తరిస్తుందని, ప్రజలను మభ్యపెట్టకుండా నిజాయితీగా పనిచేస్తుందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## తెలంగాణ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్-2026 అమల్లోకి




సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన తెలంగాణ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్-2026 అమల్లోకి వచ్చింది. జూన్ 2, 2026 నుంచి ఈ చట్టం అమల్లోకి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. G.O.Ms.No.41 ద్వారా అమలు తేదీని ప్రకటించిన ప్రభుత్వం, తెలంగాణ చరిత్రలో తొలిసారిగా న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. తెలంగాణ యాక్ట్ నెం.16 ఆఫ్ 2026గా ఈ చట్టం అమలులోకి వచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. న్యాయవాదుల విధి నిర్వహణలో రక్షణ, గౌరవం, భద్రత కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

## వేడిగాలుల నేపథ్యంలో పరేడ్ సమయాన్ని ముందుకు మార్చిన సీఎం రేవంత్ రెడ్డి

**వేడిగాలుల ప్రభావంతో ముందస్తుగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ పరేడ్**

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో తీవ్ర వేడిగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో పరేడ్ నిర్వహణ సమయాన్ని ఉదయం 10 గంటల నుంచి 8:30 గంటలకు ముందుకు మార్చాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థులు, పరేడ్ బృందాల ఆరోగ్యం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఆసిఫాబాద్‌లో నిర్వహించిన సభపైనా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సభను సూర్యాస్తమయం అనంతరం నిర్వహించినట్లు వెల్లడైంది. కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి రాత్రి ఆలస్యంగా రోడ్డు మార్గంలో ప్రయాణించారు. ఈ సందర్భంగా సాధారణ వాహనాల మాదిరిగానే సీఎం కాన్వాయ్ ప్రయాణించగా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా కాన్వాయ్ వాహనాల సంఖ్యను తగ్గించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ప్రయాణాల కోసం ట్రాఫిక్ నిలిపివేయొద్దని ఇప్పటికే అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

## పంచాయతీ కార్మికులకు డ్రెస్ కోడ్ అందజేత



సందేశం టైమ్స్, బస్వాపురం, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ 12వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బస్వాపురం గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్మికులకు డ్రెస్ కోడ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్వాపురం సర్పంచ్ ఆవుల నరసింహారావు, ఉప సర్పంచ్ చంద్రకాని నరసింహారావు, గ్రామ కార్యదర్శి రామకృష్ణ పాల్గొని కార్మికులకు డ్రెస్ కోడ్ అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత, అభివృద్ధిలో పంచాయతీ కార్మికుల సేవలు అమూల్యమని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రసాల మోహనరావు, మార్గం శ్రీను, దొంతకాని తిరుమలి, సోమ సత్యనారాయణ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాంసాన్‌పల్లి గ్రామంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాంసాన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాలాపన నిర్వహించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక సంవత్సరాల పాటు సాగిన ఉద్యమాన్ని స్మరించుకున్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి పోరాట ఫలితంగానే 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు. తెలంగాణ ఉద్యమం ప్రజల ఆత్మగౌరవ పోరాటమని, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, రైతులు, దివ్యాంగులు సహా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో భాగస్వాములై రాష్ట్ర సాధనకు కృషి చేశారని గుర్తుచేశారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశభక్తి భావన ప్రతి పౌరునిలో ఉండాలని, జాతీయ జెండాను గౌరవించడం ప్రతి భారతీయుని బాధ్యత అని పేర్కొన్నారు. యువత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం విద్య, వ్యవసాయం, తాగునీరు, రహదారులు, సంక్షేమ పథకాల అమలులో గణనీయమైన అభివృద్ధి సాధించిందని వక్తలు కొనియాడారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, విద్యాభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ గీతాలాపన నిర్వహించి కార్యక్రమాన్ని దేశభక్తి నినాదాలు, తెలంగాణ జైజైధ్వానాలతో ఉత్సాహభరితంగా ముగించారు.



## కర్ణాటక క్యాబినెట్ కసరత్తుపై ఢిల్లీలో కీలక చర్చలు

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, జూన్ 3, ప్రతినిధి: కర్ణాటక రాష్ట్రంలో కొత్త మంత్రి వర్గ కూర్పుపై కాంగ్రెస్ అధిష్టానం కీలక కసరత్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు ఢిల్లీలో పార్టీ పెద్దలతో సమావేశమై మంత్రి వర్గ విస్తరణ, రాజ్యసభ కౌన్సిల్ సీట్ల అంశాలపై చర్చలు జరిపినట్లు సమాచారం. దాదాపు పది మంది పేర్లపై ఏకాభిప్రాయం కుదిరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి సతీష్ జర్కిహోళి, హెచ్‌కే పాటిల్, బీకే హరిప్రసాద్ పేర్లకు డీకే శివకుమార్ మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. అహింద వర్గాలకు ప్రాధాన్యత కలిగిన శాఖలు ఇవ్వాలని సిద్ధరామయ్య పట్టుబడుతుండగా, తన వర్గానికి పది కంటే ఎక్కువ మంత్రి పదవులు ఇవ్వవద్దన్న అభిప్రాయం అధిష్టానంలో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. జీ పరమేశ్వర, జమీర్ అహ్మద్ ఖాన్, కేజే జార్జ్, ఎంబీ పాటిల్‌లకు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇవ్వాలని సిద్ధరామయ్య కోరుతున్నారని, అయితే అలాంటి నిర్ణయం మరో పవర్ సెంటర్‌కు దారితీస్తుందని డీకే శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. సిద్ధరామయ్య తనయుడు యతీంద్రకు క్యాబినెట్‌లో చోటు కల్పించేందుకు అధిష్టానం అంగీకరించినట్లు సమాచారం. తొలి దశలో 10 నుంచి 20 మంది మంత్రులతో ప్రమాణ స్వీకారం నిర్వహించే అవకాశం ఉందని, రేపు డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## తెలంగాణ అస్థిత్వ పోరాట స్ఫూర్తితో మళ్లీ ఏకమవుదాం: బిఆర్ఎస్ నాయకులు



సందేశం టైమ్స్, చింతకాని, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతకాని బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నాగులవంచ గ్రామంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కల్వకుంట్ల చంద్రశేఖర రావు చూపిన అజేయ పోరాట స్ఫూర్తిని, రాజకీయ వ్యూహాలను గుర్తు చేశారు. ఎన్నో అవమానాలు, ఆటంకాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా ఢిల్లీ స్థాయిలో పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని గుండెల్లో నింపుకుని కష్టపడి సాధించుకున్న తెలంగాణను దోపిడీదారుల చెర నుండి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ వాదిపై ఉందన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం తెలంగాణ వాదులంతా మళ్లీ ఏకం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చింతకాని మండల పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గులాబీ దండు కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. జై తెలంగాణ, జై బిఆర్ఎస్ అంటూ నినాదాలతో కార్యక్రమం ముగిసింది.



## నర్సాపూర్‌లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపూర్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్న రమేష్ గౌడ్, కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్, నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు నిరుడి చంద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, సంఘసాని రాజు, సిద్దు, చందు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ సాయి కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు సుధీర్ గౌడ్, ఇల్యాస్ ఖాన్, ధావూద్, అంజినేయులు గౌడ్, రవి, బిక్షపతి, మొయిజ్, షేక్ హుస్సేన్, రాజు, చింతకుంట శ్రీకాంత్, నిరంజన్, జగదీష్, రషీద్, సాయి కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొని తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## పటాన్చెరులో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 3, బి డేవిడ్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్చెరు డివిజన్ పరిధిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. జాతీయ రహదారి సమీపంలో ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపానికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 14 సంవత్సరాల పాటు సాగిన మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఫలితంగానే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ఆకాంక్షలు నెరవేరాయని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి పటాన్చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నాగులవంచ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, చింతకాని, జూన్ 3, ప్రతినిధి: మండల పరిధిలోని నాగులవంచ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జాతీయ గీతాలాపన, జాతీయ జెండా ఆవిష్కరణతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నారగాని రాంబాయి జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, ప్రజల ఆకాంక్షల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ భారతదేశంలో 29వ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిందన్నారు. ఎన్నో అమరవీరులు, విద్యార్థులు, ఉద్యమకారుల ఆత్మ సమర్పణలు, సుదీర్ఘ ఉద్యమ పోరాటాలకు ఈ రోజు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబటి శరత్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి బుద్దె చిరంజీవి, వార్డు సభ్యులు కంభం సునీత, గంధం ఇందిర, బైరు రేణుక, అన్నెపోగు రవి, గురిజాల జయకుమార్, గ్రామ పెద్దలు ఆలస్యం బసవయ్య, సామినేని అప్పారావు, ముత్తినేని వెంకటేశ్వర్లు, వెచ్చా మంగపతి రావు, ఆలస్యం రవి, కందరబోయిన కొండలు, గంధం కృష్ణ, గార్లపాటి కాంతారావు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జిన్నారంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 3, బి డేవిడ్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిన్నారం మునిసిపల్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పిలుపు మేరకు జిన్నారం మునిసిపల్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. పఠాన్ చెరువు నియోజకవర్గం జిన్నారం మునిసిపల్‌లో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాయికోటి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలు, కోట్లాది తెలంగాణ ప్రజల ఆకాంక్షల ఫలితంగా సాధించిన తెలంగాణ ఆత్మగౌరవాన్ని స్మరించుకున్నారు. తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జనార్దన్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులకు ఘన సత్కారం

సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 3, ప్రతినిధి: పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఐపీఎస్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ పొందిన వారిలో కాకినాడ తృతీయ పట్టణ ఎస్సై కె. విజయ్ కుమార్, కాకినాడ ప్రథమ పట్టణ ఎస్సై సి.హెచ్. కుమార్, కాకినాడ పోర్ట్ ఎస్సై ఎ. సూర్య ప్రకాష్, ట్రాఫిక్-వన్ ఎస్సై కె. అప్పారావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె. నారాయణరావు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి వారి సుదీర్ఘ సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో వారు చూపిన నిబద్ధతను అభినందిస్తూ వారి విశ్రాంత జీవితం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎం. నరసింహమూర్తి, కె. వెంకటరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.వి.వి. సత్యనారాయణమూర్తి, ఎస్పీ సీసీ ఎస్. రాంబాబు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మెదక్ జిల్లా కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ మెదక్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులను స్మరించుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఆనాడు పార్లమెంట్‌లో సుష్మా స్వరాజ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతుగా గళమెత్తి మాట్లాడడం వల్లే తెలంగాణ రాష్ట్ర సాధనకు బలమైన మద్దతు లభించిందన్నారు. సుష్మా స్వరాజ్ వంటి మహానీయురాలిని స్మరించుకోవడం ఆనందకరమని పేర్కొంటూ ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, కౌన్సిలర్లు ఇప్ప అఖిల్ భారత్, పబ్బ రాజమణి, లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, జిల్లా నాయకులు లోకేష్, మధు, వేణు, బిక్షపతి, శివ, నర్సాపూర్ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు రాణి, బీజేవైఎం శ్యామ్, బీజేపీ నాయకులు ప్యాట నగేష్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం - అభివృద్ధి - సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వ పరిపాలన: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సందేశం టైమ్స్, ఖమ్మం, జూన్ 3, ప్రతినిధి: సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పెవిలియన్ గ్రౌండ్‌లోని అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి నివాళులర్పించిన ఉప ముఖ్యమంత్రి అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా రక్షణ కల్పించే "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా" పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో 59,448 కొత్త రేషన్ కార్డులు జారీ చేసి 2,01,163 మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని, మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా రూ.303.55 కోట్ల మేర ఆదా జరిగిందని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 2,50,204 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 458 స్వశక్తి భవనాల నిర్మాణం కొనసాగుతోందని, మహిళా సంఘాలకు వడ్డీ రాయితీలు అందిస్తున్నామని చెప్పారు. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని, ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టామని వెల్లడించారు. ఖమ్మం ఖిల్లా వద్ద రూ.29 కోట్లతో రోప్‌వే నిర్మాణం, అమృత్ 2.0 పథకం కింద రూ.250 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్య, వైద్యం, సాగునీరు, విద్యుత్, రహదారులు, పర్యాటకం, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల కుటుంబ సభ్యులను ఉప ముఖ్యమంత్రి సత్కరించారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా వివిధ శాఖల శకటాల ప్రదర్శనను పరిశీలించి అధికారులను అభినందించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అమరవీరుల కుటుంబ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మధిర బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు





సందేశం టైమ్స్, మధిర, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మధిర పట్టణంలోని భారత్ రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి లింగాల కమల్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మధిర మేజర్ సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణ ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, లింగాల కమల్ రాజు పార్టీ జెండాను ఎగరవేసి వందనం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గులాబీ జెండాలతో సాగిన ఈ ర్యాలీతో మధిర పట్టణం సందడిగా మారింది. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కార్యకర్తలను ఉద్దేశించి లింగాల కమల్ రాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గడిచిన పదేళ్లలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. తెలంగాణ సంపదను కాపాడుకోవడానికి ప్రజలంతా మళ్లీ ఏకమై రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మధిర నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నర్సాపూర్ జూన్ 3 (సందేశం టైమ్స్ వి సాయి)ఈరోజు భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ గారి ఆధ్వర్యంలో బీజేపీ మెదక్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ పథకాన్ని ఎగరవేయడం జరిగింది. జిల్లా అధ్యక్షుల వారు మాట్లాడుతూ ఆనాడు పార్లమెంట్ లో సుష్మా స్వరాజ్ గారు గొంతు ఎత్తి మాట్లాడడం వల్లే ఈరోజు తెలంగాణ మనకి రావడం జరిగింది. సుష్మా స్వరాజ్ గారిలాంటి మహానీయురాలిని స్మరించుకోవడం చాలా సంతోషకరమైన విషయం కావున అందరికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్ కౌన్సిలర్లు ఇప్ప అఖిల భారత్ పబ్బ రాజమని లక్మన్ జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి MLN రెడ్డి జిల్లా నాయకులు లోకేష్ మధు వేణు బిక్షపతి శివ నర్సాపూర్ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షులు రాణి బీజేవైఎం శ్యామ్ బీజేపీ నాయకులు ప్యాట నగేష్ బాలరాజ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## అంగరంగ వైభవంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి తథా జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరై తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాలాపన చేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాట ఫలితంగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తూ ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సంఘాలకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య సభ్యులకు 102 కోట్ల 35 లక్షల రూపాయల జంబో చెక్కును మంత్రి అందజేశారు. అలాగే శంకరంపేట (ఆర్) మండలం గరిపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించి గుడిసెలు లేని మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా పాల్గొన్న విద్యార్థులను మంత్రి అభినందించి జ్ఞాపికలు అందజేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి పరిశీలించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, ఆర్డీవో రమాదేవి, ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (ఆర్) మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, తూప్రాన్ డీఎస్పీ, తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ తదితర అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

## సంగారెడ్డిలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 3, కె. సంగమేశ్వర్: తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, జిల్లాలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. అమరవీరుల ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకోగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నలుగురు దృష్టిలోపం కలిగిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. 768 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద రూ.69.19 కోట్ల చెక్కులను అందజేశారు. ట్రాన్స్‌జెండర్‌లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసి, పీఎం శ్రీ పాఠశాలల వేసవి శిబిరాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. అంతకుముందు ఐబీ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, నర్సాపూర్, జూన్ 3, వి సాయి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ సాయి కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు సుధీర్ గౌడ్, ఇల్యాస్ ఖాన్, ధావూద్, అంజినేయులు గౌడ్, రవి, బిక్షపతి, మొయిజ్, షేక్ హుస్సేన్, రాజు, చింతకుంట శ్రీకాంత్, నిరంజన్, జగదీష్, రషీద్, సాయి కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొని తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## నర్సాపూర్‌లో అర్ధరాత్రి వేళ అక్రమ మట్టి రవాణా – అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల్లో ఆగ్రహం



సందేశం టైమ్స్, నర్సాపూర్, జూన్ 3, వి సాయి: నర్సాపూర్ మండలం మంతూర్ గ్రామ పరిధి నుంచి భారీ ఎత్తున అక్రమ మట్టి రవాణా జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి 12 గంటలు దాటిన తర్వాత కూడా వందలాది టిప్పర్ల ద్వారా అతివేగంగా మట్టిని నర్సాపూర్ మీదుగా గుమ్మడిదల ప్రాంతానికి తరలిస్తున్నారని సమాచారం. ఈ అక్రమ రవాణా కారణంగా రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో టిప్పర్ల రాకపోకల వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున మట్టి తరలింపు జరుగుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ మట్టి రవాణాపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను కోరుతున్నారు. ప్రజల భద్రత, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణ దృష్ట్యా ఈ వ్యవహారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## మహిళలు రవాణా రంగంలో ప్రవేశించడం వల్ల మహిళా సాధికారత పెరుగుతుంది

### ఆటో డ్రైవర్‌గా అదనపు కలెక్టర్ నగేష్ – ఆటోలో ప్రయాణించిన కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: మహిళలు రవాణా రంగంలోకి ప్రవేశించడం వల్ల మహిళా సాధికారత మరింత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. అజీవిక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన పథకం కింద రూ.3,35,000 విలువైన మహేంద్ర ఎలక్ట్రిక్ ఆటోను మక్తా భూపతిపూర్ గ్రామానికి చెందిన కే. సంధ్యారాణికి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంధ్యారాణి గత రెండేళ్ల క్రితం గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ఉపాధి నిమిత్తం దరఖాస్తు చేసుకోగా, పరిశీలన అనంతరం ఆమెను అర్హురాలిగా గుర్తించి ఆటో మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలలో నివసించే ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రవాణా సేవల ద్వారా అదనపు ఆదాయం, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. మక్తా భూపతిపూర్ గ్రామంలో రవాణా సమస్య ఉందని తమ దృష్టికి రావడంతో వెంటనే ఎలక్ట్రిక్ ఆటోను మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ ఆటో డ్రైవర్‌గా మారి ఆటో నడపగా, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆటోలో ప్రయాణించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు, అదనపు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సరస్వతి, డీపీఎం యాదయ్య, ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో 85 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి – 164 కొనుగోలు కేంద్రాలు మూసివేత



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో 85 శాతం పనులు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఇప్పటివరకు 68,518 మంది రైతుల వద్ద నుంచి 3,31,982.080 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా 53,086 మంది రైతుల ఖాతాల్లో రూ.571.48 కోట్లు జమ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. మొత్తం 164 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసివేశామని తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజూ సమీక్షలు చేస్తూ రవాణా, మిల్లులకు తరలింపు, నిల్వ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ధాన్యం బస్తాలు ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న లారీలు, ట్రాక్టర్లు, డీసీఎంల ద్వారా రవాణాను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ పరీక్షలు, కాంటా ప్రక్రియ, రికార్డుల నిర్వహణను పర్యవేక్షిస్తూ ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వారం రోజుల్లో మిగిలిన కేంద్రాల్లో కూడా కొనుగోళ్లు పూర్తి చేసి కేంద్రాలను పూర్తిగా మూసివేస్తామని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 3, పుల్కల్ మండలం ప్రతినిధి మహేష్ బాబు: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుల్కల్ మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలో, గ్రామపంచాయతీలలో, ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఎగరవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనేక దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, త్యాగాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ భారతదేశంలో 29వ రాష్ట్రంగా అవతరించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 3, బి డేవిడ్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఉద్యమ వీరులు, అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. వారి ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సంక్షేమం, అభివృద్ధితో తెలంగాణ మరింత ముందుకు సాగాలని పేర్కొన్నారు. “మన రాష్ట్రం – మన గౌరవం – మన తెలంగాణ” అని పృథ్వీరాజ్ అన్నారు.

## జూన్ 4, 6, 8, 10 తేదీల్లో గ్రామసభలు, వార్డు సభలు పకడ్బందీగా నిర్వహించాలి – జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశం





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ, పర్యావరణ వారోత్సవాల నిర్వహణతో పాటు గ్రామసభలు, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. ఈ అంశంపై మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, మెదక్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాసరావు కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రైతులు పంటల మార్పిడి దిశగా సాగాలని, వర్షాకాల సన్నద్ధత, మొక్కల నాటకం, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై చైతన్యం కల్పించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఈ నాలుగు తేదీల్లో మండలాల వారీగా అన్ని గ్రామాల్లో గ్రామసభలు, వార్డు సభలు సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు. బాల్య వివాహాల నివారణ, రోడ్డు భద్రత, మహిళల భద్రత, పంట మార్పిడి, ఇంకుడు గుంతల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, పంచాయతీ అధికారి యాదయ్య, వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, డీఎస్పీలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## టేక్మాల్ మండలంలోని సాలోజిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమం



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: టేక్మాల్ మండలంలోని సాలోజిపల్లి గ్రామంలో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్, సాలోజిపల్లి సర్పంచ్ మొహమ్మద్ ఇర్షద్, టేక్మాల్ సర్పంచ్ తిమ్మి సుధాకర్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించారు. మెదక్ జిల్లా మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ మహజర్డీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, శ్రీధర్ చారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాంబెల్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న గృహసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి



సందేశం టైమ్స్, ఝురాసంగం, జూన్ 3, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఝురాసంగం మండల పరిధిలోని ఝురాసంగం–భూపాలపల్లి గ్రామాల శివారులో మంగళవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం బొప్పానపల్లి నుంచి ఝురాసంగం వైపు పల్సర్ బైక్‌పై వస్తున్న మన్నే సాయి కిరణ్ (25), తండ్రి గోపాల్, తుమ్మలపల్లి గ్రామం, మార్పల్లి మండలం, వికారాబాద్ జిల్లా వాసి, అదే సమయంలో ఝురాసంగం నుంచి బొప్పానపల్లి వైపు స్ప్లెండర్ బైక్‌పై వెళ్తున్న మరో వ్యక్తి ఎదురుగా వస్తుండగా మార్గమధ్యంలో రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మన్నే సాయి కిరణ్ తీవ్ర గాయాలపాలై ఘటన స్థలంలోనే మృతి చెందగా, స్ప్లెండర్ బైక్‌పై ప్రయాణిస్తున్న చిలమామిడి గ్రామానికి చెందిన వ్యక్తి తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోగా స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి అతడిని చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించగా, మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నామని, పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా





సందేశం టైమ్స్, వట్పల్లి, జూన్ 3, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని మరవెల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ చిన్నపట్ల మల్లేశ్వరమ్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఏఈఓ మహేష్ ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందానికి సర్పంచ్ ఆధ్వర్యంలో మందారం పూల మొక్కలను పంపిణీ చేశారు. అలాగే రైతు వేదిక ప్రాంగణంలో మందారం మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాభివృద్ధి, గ్రామాభివృద్ధికి అందరూ కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెండికోలు భూమయ్య, వ్యవసాయ శాఖ ఏఈఓ మహేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు రాజు పటేల్, సీహెచ్ బస్వరాజ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా నాయకుడు సిద్ధిపేట ముద్దుబిడ్డ తన్నీరు హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 3, ప్రతినిధి: ప్రజా నాయకుడు, మాజీ మంత్రివర్యులు, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన సందర్భంగా ఆందోల్ నివాసి మన్నె పరిపూర్ణ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరీష్ రావు ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా, చిన్న పెద్ద తేడా లేకుండా అందరినీ కలుపుకుపోయే గుణం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. రాజకీయ పరిజ్ఞానం కలిగిన నాయకుడిగా ప్రజల్లో విశేష గౌరవం సంపాదించారని తెలిపారు. “ఆరడుగుల బుల్లెట్”గా ప్రసిద్ధి చెందిన హరీష్ రావు సిద్ధిపేట ప్రాంత అభివృద్ధికి కీలకంగా నిలిచారని ఆమె పేర్కొంటూ ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజాపాలనలో ప్రజల గోస.. ఇంటి శిథిలంతో కుటుంబం ఆవేదన



సందేశం టైమ్స్, అల్లాదుర్గం, జూన్ 3, ప్రతినిధి కుమార్: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం మందాపూర్ గ్రామంలో పాముల లక్ష్మి కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇంటి వెనుక భాగంలో ఉన్న కాలువ కారణంగా వారి నివాస గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరగా, గత ఏడాదిగా ఇల్లు కూలిపోయిన పరిస్థితిలోనే జీవనం కొనసాగిస్తున్నామని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాసం లేదా గృహ పునర్నిర్మాణానికి సంబంధించి ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదని, ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో అర్హత ఉన్నా తమ పేరు నమోదు కాలేదని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో కొత్తగా ఇల్లు నిర్మించుకునే స్థోమత లేకుండా పోయిందని తెలిపారు. ఏ క్షణమైనా వర్షాల కారణంగా ఇల్లు పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని, ప్రాణాలకు ముప్పు ఉన్నా అధికారులు స్పందించకపోవడం పట్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కొల్చారంలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, కొల్చారం, జూన్ 3, ప్రతినిధి: మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన నాయకుల సేవలను గుర్తు చేసుకుంటూ రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతీయ గీతాలాపన చేసి వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

## శేష్విత జన్మదిన వేడుకలు ఘనంగా



సందేశం టైమ్స్, వట్పల్లి మండలం, జూన్ 3, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలోని మర్వెల్లి గ్రామంలో సందేశం టైమ్స్ క్రైమ్ రిపోర్టర్ టి. నాగరాజు గారి కుమార్తె శేష్విత జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శేష్విత కేక్ కట్ చేసి తన జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. “శేష్విత జీవితంలో ప్రతి అడుగులో విజయాలు సాధిస్తూ, ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం” అని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని శేష్వితకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి వేడుకలను విజయవంతం చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.